సీపీఐ జాతీయ సమితి సభ్యుడిగా కలవేన శంకర్



మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ రాష్ట్రంలోని చండీగడ్‌లో ఈ నెల 21 నుంచి 25వరకు జరిగిన 25వజాతీయ మ హాసభలో సీపీఐరాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ సీపీఐ జాతీయసమితి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కలవేన శంకర్‌కు సీపీఐ జిల్లాకార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల దాసులు శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

దండేపల్లి సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 2025-26 విద్య సంవత్సరంలో ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు పొందేందుకు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సంగర్స్ రాజేశ్వర్‌రావు కోరారు. ఓపెన్ స్కూల్ ద్వారా చదువుకునే అభ్యాస కులు ప్రవేశం పొందేందుకు ఈనెల 30 చివరి అవకాశమని, ప్రవేశాలు పొందే అభ్యాసకులు స్థానిక మీసేవ,ఆన్‌లైన్ కేంద్రాలలో ఫీజ్ చెల్లించి, వీటిని సద్వినియో గం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకోసం 8309769067 లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఒకేషనల్, పా రామెడికల్, మహాలక్ష్మి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాలల చైర్మన్, కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ డా. శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆట పాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, మహాలక్ష్మి, సాయికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



వైన్‌షాపుల టెండర్లకు నోటిఫికేషన్

- నేటి నుంచి దరఖాస్తు ప్రక్రియ షురూ
- ఒక్కో దరఖాస్తు రుసుం రూ. 3 లక్షలు
- అక్టోబరు 23న డ్రా పద్ధతిలో షాపుల కేటాయింపు
- నవంబరు నెలాఖరుకు వరకు పాత లైసెన్స్ గడువు

మంచిర్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైన్ షాపు టెండర్లకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న మద్యం దుకాణాల లైసెన్స్ గడువు నవంబర్ 30తో ముగియనుంది. 2025-2027 సంవత్సరానికి గాను ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా, జిల్లా స్థాయిలో అధికారులు మద్యం షాపు ల టెండర్ల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, లక్సెట్టిపేట ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో గత మద్యం పాలసీ మాదిరిగానే ఈ సారి కూడా మొత్తం 73 ఏ4 మద్యం షాపులను ఏర్పాటు చేయనున్నారు. కొత్త లైసెన్స్‌లను లాటరీ పద్ధతిలో ఎంపిక చేసేందుకు అబ్కారీశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

పెరిగిన దరఖాస్తు రుసుము...

మద్యం షాపుల టెండర్లలో పాల్గొనదలిచే వ్యాపారులు గతంలో కంటే అధికంగా దరఖాస్తు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. రెండేళ్ల కాలపరిమితితో ఒక్కో షాపునకు దరఖాస్తు చేసేందుకు రూ. 3 లక్షల నాన్ రిఫండబుల్ ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది. మద్యం పాలసీలో దరఖాస్తు రుసుం రూ. 2 లక్షలు ఉండగా, ఈసారి అదనంగా లక్ష రూపాయలను పెంచింది. జిల్లాలో మద్యం వ్యాపారం లాభసాటిగా ఉండటంతో గతంలో మాదిరిగానే ఈ సారి కూడా లిక్కర్ వ్యాపారులు పోటీపడే అవకాశాలు ఉన్నాయి. మద్యం దుకాణాలకు ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించడంతో దరఖాస్తు చేసేందుకు అవసరమైన సొమ్మును సమకూర్చుకునే పనిలో వ్యాపారులు నిమగ్నమయ్యారు. వ్యాపారులు కొంత మంది కలిసి సిండికేటుగా ఏర్పడి ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు చేసేందుకు మంతనాలు జరుపుతున్నారు. అయితే ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించడంతో దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం....

వైన్ షాపుల టెండర్లలో పాల్గొనదలిచే వ్యాపారులు ఈ నెల 26 నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియ ముగియగానే, సంబంధిత వ్యాపారుల సమక్షంలో అదే నెల 23వ తేదీన లక్కీ డ్రా నిర్వహించి దుకాణాల లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. లక్కీ డ్రా విజేతల కొత్త దుకాణాలకు లైసెన్స్ కాలపరిమితి డిసెంబరు 1వ తేదీ నుంచి ప్రారంభమై 2027 నవంబరు 30 వరకు అమలులో ఉండనుంది. డిసెంబరు ఒకటవ తేదీ నుంచే దుకాణాల్లో మద్యం విక్రయాలు జరిపేందుకు అవకాశం ఉంది.

షాపులకు రిజర్వేషన్లు ఇలా...

జిల్లాలో మద్యం షాపులకు రిజర్వేషన్లు గత మద్యం పాలసీకి భిన్నంగా వివిధ కేటగిరీల దమాషానా షాపులు కేటాయించనున్నారు. జిల్లాలో మొత్తం 73 మద్యం షాపులు ఉండగా మొత్తంగా 30 శాతం రిజర్వేషన్ అమలు చేయనున్నారు. ఈ క్రమంలో 22 దుకాణాలను వివిధ వర్గాల..

(తరువాయి 7లో)

డ్రా పద్ధతిన, రిజర్వేషన్ ప్రకారం మద్యం దుకాణాల కేటాయింపు



డ్రా తీస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 73 ఏ4 మద్యం దుకాణాల్లో డ్రా పద్ధతిన ఎస్సీ, ఎస్టీ, గౌడ కులస్తులకు రిజర్వేషన్ ప్రకారం మద్యం దుకాణాలను కేటాయించినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో మద్యం షాపుల రిజర్వేషన్ సంబంధిత డ్రా కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడు తూ ఏజెన్సీ ప్రాంతమైన మందమర్రి మున్సిపల్ ప్రాంతంలోని 6 మద్యం దుకాణాలను డ్రా పద్ధతిన కాకుండా షెడ్యూల్డు తెగల అభ్యర్థులకు కేటాయించామన్నారు. ఎస్సీలకు 11,22,26,36,42,45,61,64,65,67 నెంబర్లు గల దుకాణాలు, గౌడ కులస్తులకు 9,13,29,31,37,59 నెంబర్లు గల దుకాణాలను రిజర్వేషన్ ప్రకారం డ్రా పద్ధతిన కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అబ్కారీ మద్య నిషేధ, జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై అలసత్వం వద్దు

- డీపీవో వెంకటేశ్వర్‌రావు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో

హాజీపూర్, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దని డీపీఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం జిల్లా పంచాయతీ కార్యాలయంలో అన్ని మండలాల డీఎల్‌పీవో, ఎంపీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టాల్సిన పారిశుధ్య పనులు ముందస్తు జాగ్రత్తలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. క్షేత్రస్థాయి అధికారుల తనిఖీలు, పంచాయతీ కార్యదర్శుల అటెండెన్స్, పౌరసేవలు, 15వ ఆర్థిక సంఘం ద్వారా విడుదలైన నిధుల వినియోగం, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు, ఆడిట్, గ్రామ పంచాయతీలో చేపడుతున్న పారిశుధ్యపనులపై మండల పంచాయతీ అధికారులకు, డీఎల్‌పీవోలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్, కార్యలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్ఎంలపై అధికారుల వేధింపులు ఆపాలి

- లేకుంటే డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని ముట్టడిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఏఎన్ఎంలను ఎన్‌సీడీ చేయాలని అధికారులు వేధింపులకు గురి చేస్తుందని, ఈ వేధింపులను మానుకోవాలని లేకుంటే డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు దుంపల రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని చార్వాక హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్ఎంలపై అధిక పని భారం మోపుతోందన్నారు. గత సంవత్సరం ఏఎన్ఎంల పరీక్ష పెట్టి సంవత్సరం గడిచిపోతున్నా నేటికి ఫలితాలు ఇవ్వకుండా, కాంట్రాక్టు ఏఎన్ ఎంలను రెగ్యులర్ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. రెగ్యులర్ ఏఎన్ఎంలకు 28 ఏళ్లు గడిచినా ప్రమోషన్‌లు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏఎన్ఎంలు పద్మ, మంజుల, ధనలక్ష్మీ, సంధ్యారాణి, పుష్ప, మమతారాణి, భాగ్యలక్ష్మీ, హరిత, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

గూడెం సత్యదేవుడి హుండీ లెక్కింపు



ఆలయంలో హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, పరిశీలిస్తున్న అధికారులు

దండేపల్లి సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గూడెం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో 105 రోజుల సంబంధించిన ఆలయ హుండీ లెక్కించగా రూ. 6,31841 ఆదాయం సమకూరినట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. స్వామి వారి ప్రధాన ఆలయంలో గురువారం 105 రోజుల సంబంధించిన హుండీని దేవాదాయ శాఖ పర్యవేక్షకులు రవి, ఆలయ ముఖ్య అర్చకులు గోవర్ధన రఘస్వామి, ఆలయసూపరిండెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో లెక్కించారు. దేవస్థానానికి మొత్తం రూ6,31,841 ఆదాయం వచ్చిందన్నారు. హుండీ లెక్కింపులో ఆలయ అర్చకులు, సిబ్బంది, సత్యనారాయణస్వామి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సౌకర్యార్థం చేపట్టిన పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండలంలోని కిష్టం పేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి కళాశాల పరిధిలో కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేసి విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుం టుందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం చెన్నూరులోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల పరిధిలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచన లు చేశారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం చెన్నూరు పట్టణంలోని కొనసాగుతున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలిం చి పనులను వేగవంతం చేయాలని సూచించారు.



చెన్నూరులో అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

ప్రజలకుమెరుగైన సేవలందించేందుకు ఆరోగ్యకేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే అమృత్ 2.0 పథ కం కింద చేపట్టిన వాటర్ ట్యాంకు నిర్మాణపనులను పరిశీలించారు. నీటి ట్యాంకుల ద్వారా ప్రతి ఇంటికి సరిపడ నీటిని అందిం చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, మున్సి పల్ కమిషనర్ మురళీ కృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎడతెరపిలేని వర్షం..

- గరిష్టంగా వేమనపల్లిలో 58.2 మిల్లీమీటర్లు నమోదు
- ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద
- వర్షం కారణంగా ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం



బొక్కలగుట్ట మేడి చెరువు గండిని పరిశీలిస్తున్న కలెక్టర్

మంచిర్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం రాత్రి నుంచి ఎడతెరపిలేని వర్షం కురుస్తోంది. గడిచిన 24 గంటల వ్యవధిలో జిల్లాలో 26.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. గరిష్టంగా వేమనపల్లి మండలంలో 58.2 మి.మీవర్షం కురవగా, కోటపల్లి మండలంలో 50.4, కన్నెపల్లి మండలంలో 39.6 మి.మీ, భీమారం మండలంలో 34.4, జైపూర్ మండలంలో 30.6, హాజీపూర్ మండలంలో 29.8, నెన్నెల మండలంలో 28.6, భీమిని మం డలంలో 27.6, చెన్నూరు మండలంలో 27.4, తాండూరు మండలంలో 25.2, బెల్లంపల్లి మం డలంలో 23.4, మంచిర్యాల జిల్లా కేంద్రంలో 22.4, నస్పూరులో 22.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

ఎల్లంపల్లి ప్రాజెక్టు 40 గేట్లు ఎత్తివేత...

ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి ప్రాజెక్టుకు పెద్ద మొత్తంలో వరద కొనసాగుతోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 148 మీటర్లకు గాను సాయంత్రం 5 గంటల వరకు 146.38 వరకు నీరు చేరింది. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలకుగాను ప్రస్తుతం 15. 832 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. ప్రా జెక్టులోకి మొత్తం 6,10,388 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా ఎస్సారెస్పీ నుంచి 3,41000, కడెం నుంచి 4144 క్యూసెక్కుల నీరు చేరుతోం ది. స్థానికంగా కురిసిన వర్షాల కారణంగా మరో 2,65,244 క్యూసెక్కుల వరద చేరు తుండటంతో ప్రాజెక్టు 62 గేట్ల నుంచి 40 గేట్లు తెరిచి 6,36,135 క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి వదులుతున్నారు. అలాగే హైద్రాబాద్ మెట్రో పాలిటన్ వర్క్ స్కీం కోసం 288 క్యూసెక్కులు, ఎన్టీపీసీ అవసరాలకోసం మరో 121 క్యూసెక్కులను సరఫరా చేస్తున్నారు.

ఓసీపీల్లో ఉత్పత్తికి ఆటంకం....

ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం కారణంగా సింగరేణికి చెందిన ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకాలు ఏర్పడు తున్నాయి. జిల్లాలోని సింగరేణి ఏరియాలైన శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, గోలేటి పరిధిలోని ఓసీపీల్లో నీరు చేరడంతో విద్యుత్ మోటార్ల సహాయంతో తొలగిస్తున్నారు. భారీ వాహనాలు ఉపరితలాలకే పరిమితం అయ్యాయి.

బెల్లంపల్లి: పట్టణంతో పాటు మండలంలో బుధవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా భారీవర్షం కురిసింది. దీంతో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షాలకు ప్రజలకు ఇంటికి పరిమిత మయ్యారు. పట్టణంలోని ఆంధ్రబ్యాంక్ వీధిలో, అంబేద్కర్ చౌరస్తా వద్ద, పాత జీఎం కార్యాలయానికి వెళ్లే రహదారిపై వర్షపు నీరు నిల్వడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నస్పూర్ : అల్పపీడన ద్రోణి ప్రభావం కారణంగా బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షం వలన జన జీవనం స్తంభించిపోయింది. బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు 21.30 మీల్లీ మీటర్ల వర్షపాతం, గురువారం ఉదయం నుంచి సాయంత్రం వర కు 11.00 మీల్లి మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఎగువ నుంచి గోదావరి నదిలోకి వరద నీరు చేరడంతో సీతారాంపల్లి వద్ద వరద పరవళ్లు తొక్కు తుంది. సమీపంలోని పొలాల్లోకి వరద నీరు చేరింది. గోదావరి నదిలో వరద నీరు పెరిగినందున అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

మేడి చెరువుకు మరమ్మతులు చేపట్టాలి

- వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ కుమార్ దీపక్

మందమర్రిటౌన్: మండలంలోని రామకృష్ణాపూర్ బొక్కల గుట్ట మేడి చెరువుకు గండి పడింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చెరువుకు గండి పడడంవల్ల పెద్దఎత్తున వరద నీరు ప్రవహిస్తుంది. విషయం తెలుసుకున్న కలెక్టర్ మంగళవారం మేడి చెరువు గండిని పరిశీలించారు ఈసందర్భంగా ఇరిగేషన్ డీఈని వివరాలు అడిగి తెలుసు కున్నారు. గండికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఆయనతో పాటు తహసీల్దార్ సతీష్ కుమార్, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న...

(తరువాయి 7లో)

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం..

- ఘనంగా గజ్జె పూజా మహోత్సవం



కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

నస్పూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లోని శార్వాణి కూచి పూడి నృత్యాలయంలో చిన్నారుల కూచిపూడి నృత్యం ఎంతగానో ఆకట్టుకుంది. ఏడాది పాటు శిక్షణ పొందిన 22 మంది నాగార్జున కాలనీలోని శివాలయంలో గురువారం గజ్జె పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. తొలిసారిగా విద్యార్థులు కాలి గజ్జెకట్టి సంప్రదాయ పద్ధతిలో గురువు డాక్టర్ భా ర్గవి ప్రేమ్ చేతుల మీదుగా పూజ నిర్వహించారు. నృత్యాలయం ఎండి ప్రేమ్ చందర్ మాట్లాడుతూ నృత్యాలయం తరఫున మూడవ గజ్జె పూజ కార్యక్రమన్నారు. విద్యార్థులు అనేక వేదికలపై అద్భుత పదర్శనలు ఇస్తున్నారన్నారు. అంతరించిపోతున్న సంప్రదాయ ప్రాచీన కళ కూచిపూడి నృత్యా న్ని ప్రోత్సహించి ఆసక్తి కలిగిన వారికి నేర్పించి జాతీయ స్థాయిలో ప్రదర్శ నలు ఇప్పించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో గజ్జె పూజ విద్యార్థులు, సీనియర్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

తాండూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆటోలో మర్చిపోయిన ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌ను తిరిగి ఆటో డ్రైవర్ అప్పగించాడు. అచ్చులాపూర్‌కు చెందిన నాగం తరువడి అనే ప్రయాణికులు ఆటోలో తాండూర్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ఫోన్‌ను ఆటోలో మర్చిపోయాడు. సెల్‌ఫోన్‌ను గమనించిన ఆటో డ్రైవర్ ఫోన్ దగ్గర ఉంచుకున్నాడు. కాసేపటికి బంధువులు ఫోన్ చేయడంతో ఫోన్ మర్చిపోయిన విషయం తెలిపాడు. దీంతో ఫోన్ పోగొట్టుకున్న తరువడి ఆటో డ్రైవర్ వద్దకు రావడంతో సెల్‌ఫోన్ అందించాడు.

ఆహ్వాన పత్రాల ఆవిష్కరణ

సిర్పూర్(టి), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం ఈసుగాం శివమల్లన్న ఆలయంలో అక్టోబరు 16న జిల్లా ఆర్యవైశ్య మహాసభ, జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి అనుసంధాన శ్రీలక్ష్మి కుబేర సామూహిక లక్ష కుంకుమార్చన కార్యక్రమ ఆహ్వాన పత్రాలను గురువారం సిర్పూర్(టి)లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువు మాట్లాడుతూ భక్తులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

ఉపాధ్యాయులకు టెట్ టెన్షన్

- అర్హత ఉండాలని సుప్రీంకోర్టు తీర్పు
- పదోన్నతులకు తప్పనిసరి చేస్తూ ఆదేశాలు





బెజ్జూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ టెన్షన్ పట్టుకుంది. ఐదేళ్లకు పైబడి సర్వీస్‌ఉన్న ఇన్ సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు రెండేళ్లలోపు టెట్(టీచర్‌ఎలిజిబుల్‌టెస్ట్)లో ఉత్తీర్ణులు కాని పక్షంలో ఉద్యోగాన్ని వదులుకోవాల్సిందేనని ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుఉలిక్కిపడేలా చేసింది. ఈ తీర్పు ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు కూడా వర్తిస్తుందా అన్న ఆందోళన వ్యక్తమవుతోంది. సుప్రీంకోర్టు ఈ నెల 1న ఇచ్చిన తీర్పులో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా కొనసాగడానికి, పదోన్నతులకు టెట్ అర్హత తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఐదేళ్ల సర్వీస్ ఉన్నవారు రెండేళ్లలో టెట్ ఉత్తీర్ణత సాధించాలని పేర్కొ న్నది. లేని పక్షంలో ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపింది.

● పదవీ విరమణకు ఐదేళ్లలోపు..

పదవీ విరమణకు ఐదేళ్లలోపు సమయం ఉన్న టీచ ర్లకు మినహాయింపు ఇచ్చినప్పటికీ, వారు పదోన్నతుల కోసం టెట్ పాస్ కావాల్సి ఉంటుంది. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ) ఆర్‌టీఐ-2010 నిబంధనల ప్రకారం టెట్ తప్పనిసరి చేయగా, ఉమ్మడి రాష్ట్రంలో 2012డీఎస్సీలో ఈ నిబంధన అమలైంది. జిల్లాలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. జిల్లాలో 560 ప్రాథ మిక పాఠశాలలు ఉన్నాయి. 102 ప్రాథమికోన్నత పాఠశాలలు, మరో 58 జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. వీరిలో చాలా మందికి టెట్ అర్హత లేదు. దాంతో తమకు ఇబ్బంది కలుగకుండా ప్రభుత్వం, విద్యాశాఖ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు సుప్రీంకోర్టు తీర్పును యువత స్వాగతిస్తోంది. కొంతమంది సీనియర్లు దశాబ్దాల తరబడి పాఠశాలల్లో బోధన చేస్తున్నారు. ఇప్పుడు వయసు, ఆరోగ్య సమస్యలు, ఇంటి బాధ్యతల వంటి కారణాలతో మళ్లీ పరీక్షకు సిద్ధమవ్వడం కష్టమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● చొరవ చూపాలి..

ప్రభుత్వ ఉపాధ్యాయుల సేవలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాలు రూపొందించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. టెట్ అర్హతపై సడలింపులు లేదా ప్రత్యామ్నాయ పరిష్కారాలు అవస రమని ఒత్తిడి చేస్తున్నారు. ఎప్పుడో చదువుకున్న ఉపా.ధ్యాయులకు ఇప్పుడు టెట్ అర్హత చేయడం సరికాదం టున్నారు. గతంలో ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారమే తాము కొనసాగుతున్నామని చెబుతున్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

జైపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారం ఎక్స్‌రోడ్డు సమీపంలో అటవీ ప్రాంతంలో అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీకి చెందిన బోయిని శంకర్ (35) చేపలు పట్టుకుని జీవించేవాడు. శంకర్ ఐదేళ్లుగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రిల్లో చికిత్స తీసుకున్నా నయం కాలేదు. ఈ నెల 23న రాత్రి 7 గంటలకు చేపలు పట్టేందుకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఈ నెల 24న మంచిర్యాల నుంచి బస్సు ద్వారా ఇందారం ఎక్స్‌రోడ్డుకు చేరుకుని హైవే రోడ్డు పక్కన గల అటవీ ప్రాంతంలో ఒక మద్ది చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. తన చావుకు ఎవరు కారణం కాదని, అనారోగ్యం వల్లనే సూసైడ్ చేసుకుంటున్నట్లు రాసిన లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శంకర్ తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ర్యాలీవాగు ప్రాంతంలో పెద్దపులి సంచారం

హాజీపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముల్కల్ల, గుడిపేట్ శివారులోని ర్యాలీవాగు పరిసర ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తుందని రైతులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం ముల్కల్లకు చెందిన ఆర్. పోచంకు చెందిన గేదె ఇంటికి తిరిగిరాకపోవడంతో సమీప ర్యాలీవాగు అడవి ప్రాంతంలో గాలించగా పెద్దపులి దాడిలో గేదె మృతి చెందినట్లు గుర్తించారు. అటవిశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన గేదెను పరిశీలించి పెద్దపులిగా నిర్ధారించారు. బుధవారం ఉదయం గుడిపేటకు చెందిన రైతుకు సంబంధించిన నాలుగు గేదెలు మేతకు వెళ్లి ఇంటికి తిరిగిరాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవిశాఖ అధికారులు పశువులను మేత కోసం ర్యాలీవాగు సమీప అడవిలోకి తీసుకెళ్లవద్దని సూచిస్తున్నారు.

ఎలుగుబంట్ల దాడి.. ఇద్దరికి గాయాలు



గాయపడిన మల్లేష్, మారయ్య

నెన్నెల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పత్తి చేనుకు వెళ్తున్న రైతులపై ఎలుగుబంట్లు దాడి చేశాయి. ఒకేసారి మూడు ఎలుగుబంట్లు దాడి చేయడంతో ఇద్దరు రైతులు గాయ పడ్డారు. గ్రామస్థుల కథనం ప్రకారం. మైలారం పంచాయతీ పరిధిలోని దుబ్బపల్లి గ్రామానికి చెందిన గావిడి మల్లేష్, అర్ల మారయ్యలు గురువారం గ్రామ శివారులోని పత్తి చేనుకు వెల్లారు. భారి వర్షానికి దారికి అడ్డంగా పడిపోయిన చెట్టును తొలగిస్తుండగా పొదల్లోంచి పరుగున వచ్చిన ఎలుగుబంట్లు వారిపై దాడి చేశాయి. వారు గట్టిగా కేకలు వేస్తూ తప్పించుకొని సమీపంలో చెట్టుపైకెక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. ఎలుగుబంట్లు అడవిలోకి వెళ్లిన తర్వాత చెట్టు దిగి గ్రామానికి వచ్చారు. ఇరువురికి గాయాలయ్యాయి. వారిని 108లో మంచి ర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్ ఆసుపత్రికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ డాక్టర్ల కు ఫోన్ చేసి గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి గూర్చి వాకాబు చేశారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గురువారం కాగజ్‌నగర్ మండలం సీతానగర్‌కు చెందిన వౌల్కార్ అమృత (40) అనే మహిళ మృతి చెందింది. సకాలంలో సరైన వైద్యం అందిచక పోవడంతోనే మహిళ మృతి చెందిందని మృతురాలి బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శించిందని బంధువులు ఆరోపిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యం వికటించడంతోనే మహిళ ప్రాణాలు పోయాయని పేర్కొంటు ఆసుపత్రి ఎదుట బంధువులు గురువారం రాత్రి ఆందోళనకు సిద్ధమయ్యారు. బదవారం అమృత జ్వరంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. రెండు రోజులైన సరైన వైద్యం అందించడంలో వైద్యులు విఫల మయ్యారని బంధువులు ఆరోపిస్తుండగా, మహిళకు గుండెపోటు వచ్చి పరిస్థితి విషమిచిందని మెరుగైన చికిత్స కోసం ఇక్కడి నుంచి తరలించాలని బంధువులకు తెలిపినట్లు ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. బంధువులు ఆసుపత్రి వద్దకు చేరుకుంటుండగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బ్యాంకు ఖాతా కలిగి ఉండాలి

తిర్యాణి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వయోజనులుబ్యాంకు ఖాతా కలిగి ఉండాలని నాబార్డు అధికారి అంజన్న అన్నారు. మండలంలోని గడలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామీణ జన సురక్ష కార్యక్రమంపై నాబార్డు అధికారులు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులందరు ప్రధాన మంత్రి సురక్షబీమా యోజన 18 నుంచి 50 ఏళ్ల లోపు ఉన్న వయోజనులు రూ.20 చెల్లించినట్లయితే ప్రమాదవ శాత్తు చనిపోయిన వారికి రెండు లక్షల బీమా సౌకర్యం వర్తిస్తుందని అన్నారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంలో 18 నుంచి 50 సంవత్సరాల లోపు వయస్సు గల వారు బ్యాంకు ఖాతా ఉన్న వయోజనులు రూ.436 ఇన్సూరెన్స్ చెల్లిస్తే సహజ మరణిస్తే వీరికి రూ.2 లక్షలు వర్తిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ వీటని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్ర మంలో ఏడీసీసీ మేనేజర్ అనిల్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ నరేష్, కార్యదర్శి చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్సీ ఎస్టీ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న

దండేపల్లి సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, విద్యారం గంలో నెలకొన్న సమస్యలన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఎస్సీ ఎస్టీ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న అన్నారు. గురువారం దండే పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి వెంటనే పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్లు ఓపీఎస్ విధానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ ఉపాధ్యాయుల నియామకాల్లో అనుసరిస్తున్న రిజర్వేషన్ పదోన్నతుల్లో కూడా వర్తింపజేయాలన్నారు. ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు రూల్స్‌ను రూపొందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బాదవత్ ప్రకాష్‌నాయక్, రాష్ట్ర కార్యదర్శి భూక్య రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సమాచారం నవీకరించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈవో, అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు పాఠశాలల సమాచారం ఎప్పటికప్పుడు నవీకరించాలని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో గురువారం నిర్వహించిన విద్యావిభాగం సమగ్ర సమీక్ష వర్క్ షాప్‌లో మండల విద్యాధికారులు, గిరిజన అభివృద్ధి అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ఆర్పీలు, సిబ్బం దికి శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల వారీగా మౌలిక వసతులపై తనిఖీలు నిర్వహించాలని సూచించారు. నివేదికలు సిద్ధం చేసి మండల విద్యాధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారుల ద్వారా ధ్రువీకరించి, సీఆర్పీలు సేకరించిన క్షేత్రస్థాయి సమాచారాన్ని ఎక్సెల్ ఫార్మాట్‌లో సమర్పించాలన్నారు. విద్యార్థుల ప్రొఫైల్, పూర్తి స్థితి, ఉపాధ్యాయుల ప్రొఫైల్, యూడైస్‌లో ప్రధానోపాధ్యాయుల వివరాలు, పర్యవేక్ష; తక్షణ సవరణలు, విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ స్థితి, ఆధార్ లేని విద్యార్థుల వివరాల ద్వారా ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఎంబీయూ ఆధార్ ధ్రువీకృత విద్యార్థులకు అపార్ సంఖ్యల సృష్టి, పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల రిలీజ్ రిక్వెస్టుల క్లియరెన్స్ డ్రాప్‌బాక్సులో అప్‌లోడ్ చేయబడిన విద్యార్థుల నివేదికల సమీక్ష నిర్వహించాలన్నారు. పాఠశాల మెయింటెనెన్స్ గ్రాంట్ల ఖాతా వివరాలు ధ్రువీకరణ చేయాలన్నారు. డిజిటల్ పరికరాల ప్రస్తుత స్థితి పర్యవేక్షణ ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. పాఠశాల సమాచారం పారదర్శకంగా సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాని సూచించారు. కార్యక్ర మంలో జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ అబిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్య శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అబ్దుల్ కలీల్

కాసిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల్లో భాగంగా మోడల్ స్కూల్ విద్యార్థులకు అందిస్తున్న వృత్తి విద్య శిక్షన తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ కలీల్ అన్నారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో వృత్తి విద్య నైపుణ్యాలను పెంచేందుకు తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మోడల్‌స్కూల్ విద్యార్థులకు వృత్తి విద్య శిక్షణ తర గతులు నిర్వహిస్తున్నామన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు దసరా సెలవుల్లో రెగ్యులర్ కోర్సులతో పాటు సత్వర ఉపాధి కోసం సమాంతరంగా వృత్తి విద్య కోర్సులను అందిస్తున్నామన్నారు. మందమర్రి శ్రీ వైష్ణవి కంప్యూటర్ ఎడ్యుకేషన్ సొసైటి ద్వారా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.ప్రతి విద్యార్థి ఈ శిక్షణ తర గతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనర్ అశోక్, ఒకేషనల్ కోఆర్డినేటర్ కిషన్,విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ ప్రజావేదిక

వాంకిడి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఖాజా అజీజుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావేదికలో గ్రామాల్లో తనిఖీ చేసిన పనుల వివరాలు వెల్లడించనున్నామని పేర్కొన్నారు. ఈ ప్రావేదికకు ఉపాధి హామీ లబ్ధిదారులు, సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో ఖాజా అజీజుద్దీన్ కోరారు.

మద్యం దుకాణాల టెండర్లకు నోటిఫికేషన్

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- లక్కీడ్రా పద్ధతిన రిజర్వేషన్ల ప్రకారం షాపుల కేటాయింపు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మద్యం దుకాణాల గెజిట్ నోటిఫికేషన్‌ను గురువారం జారీ చేసింది. జిల్లాలో 32 మద్యం దుకాణాలకు టెండర్లను ఆహ్వానించనున్నారు. గతంలో నాన్ రిఫండబుల్‌గా ఉన్న రూ. 2 లక్షలు ఉన్న దరఖాస్తు రుసుంను రూ. 3లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. మద్యం దుకాణాలలో ఎస్టీ, ఎస్సీ, గౌడ్ కులస్తులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించనున్నారు. ఈ రిజర్వేషన్ ప్రకారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు లక్కీ డ్రాలో రిజర్వేషన్ల ప్రకారం మద్యం దుకాణాలను కేటాయించారు. కొత్త మద్యం పాలసీ ఈ ఏడాది డిసెంబరు 1 నుంచి నవంబరు 30, 2027 వరకు అమలులో ఉంటుంది. రెండేళ్ల పాటు ఈ కొత్త పాలసీ మద్యం విదానం షాపులు పని చేస్తాయి. శుక్రవారం నుంచి అక్టోబరు 18 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అక్టోబరు 23న లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాల ఎంపిక చేపట్టనుంది. జనాభా ఆధారం గా మద్యం దుకాణాల స్లాబ్‌లను నిర్ణయించింది. ఐదువేల లోపు జనాభా కలిగి ఉన్న ప్రాంతాల్ల దరఖాస్తు ఫీజు రూ. 50 లక్షలు, ఐదువేల నుంచి 50వేల జనాభా కలిగిన ప్రాంతాలలో రూ. 55 లక్షలు, 50వేల నుంచి లక్ష జనాభా కలిగి ఉన్న ప్రాంతాలలో రూ. 60 లక్షలు దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. లక్ష నుంచి ఐదు లక్షల జనాభా కలిగిన ప్రాంతాలలో రూ. 65 లక్షలు, ఐదు లక్షల నుంచి 20 లక్షల జనాభా కలిగిన ప్రాంతాలలో రూ. 85 లక్షలు, 20 లక్షలకు పైగా జనాభా కలిగిన ప్రాంతాలలో రూ. 1.10 కోట్లు దరఖాస్తు ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది.

రిజర్వేషన్ల ప్రకారం..



రిజర్వేషన్ల ప్రకారం మద్యం దుకాణాలను కేటాయిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

జిల్లాలో లక్కీ డ్రా పద్ధతిన రిజర్వేషన్ల ప్రకారం మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ ను గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే నిర్వహించా రు. 2025-2027 సంవత్సరానికి గాను జిల్లాలోని 32 మద్యం దుకాణాలకు గాను నాలుగు ఎస్సీ ఎస్టీ ఒకటి, గౌడ కులస్తులకు రెండు రిజర్వేషన్ ప్రకారం దుకాణాలను కేటాయించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 32 మద్యం దుకాణాలలో రిజర్వేషన్ ప్రకారం మద్యం దుకాణాలను డ్రా పద్ధతిన ఎంపిక చేశామని చెప్పారు. ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో షాప్‌నంబరు 1,4, కాగజ్‌న గర్ మున్సిపల్ పరిధిలో షాప్‌నంబరు 1, సిర్పూర్(టి)లో ఒకటి, మొత్తం నాలుగు షాపులు షెడ్యూల్ కులాల వారికి, రెబ్బెన మండలం గోలేటి, బెజ్జూరు మండల కేంద్రం లోని షాపులను గౌడ కులస్తులకు, కౌటాల మండల కేంద్రంలోని ఒక షాపు ఎస్టీలకు కేటాయించామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్, డీడీ రమాదేవి, జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి సజీవన్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణి అభివృద్ధికి ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని జీఎం రాధాక్రిష్ణ అన్నారు. దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఏరియాలోని కేకే ఓసీలో దుర్గామాత ఆలయంలో నిర్వహించిన పూ జలకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడు తూ ఏరియాలోని గనుల, డిపార్టుమెంట్ల వద్ద దసరా సందర్భంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఉద్యోగులు, అధికారులు ప్రతి రోజు పాల్గొంటూ పూజలు నిర్వహిస్తున్నార న్నారు. ఈ సందర్భంగా కేకేఓసీ అధికారులు అమ్మవారి ప్రసాదాల పంపిణీని అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం అన్నదానకార్యక్రమంలో ఉద్యోగులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో కేకేఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ మల్లయ్య, గని మేనేజర్ రామరాజు, బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, అసిస్టెంట్ కార్యదర్శి కంది శ్రీనివాస్, పీవీ రమణ, గోపతి సత్యనారాయణ, మర్రి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

గని ప్రమాద మృతుల వారసులకు క్లర్కు పోస్టులు



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న నాయకులు, అధికారులు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గని ప్రమాదంలో మృతి చెందిన వారి వారసులకు క్లర్కు పోస్టు గ్రేడ్-3 ఇచ్చేందుకు సింగరేణి యాజమాన్యం, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, డిప్యూటీ లేబర్ కమిషనర్ మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని డీఎల్‌సీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. గని ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు 2009లో జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం టెక్నికల్ డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ ఉంటే సంబంధిత ఉద్యోగాలు ఇచ్చేవారు. ఇతర విద్యార్హతలు ఉన్న వారికి జనరల్ మజ్దూర్(ఇప్పుడు జనరల్ అసిస్టెంట్) ఇచ్చేవారు. జూన్ 27న జరిగిన డైరెక్టర్(పా) స్థాయి 51వ స్ట్రక్చర్ సమావేశంలో గుర్తింపు సంఘం ఏఐటీ యూసీ విజ్ఞప్తి మేరకు జనరల్ డిగ్రీ ఉన్న వారికి క్లర్కు గ్రేడ్-3 పోస్టులు ఇచ్చేందుకు ఒప్పుకొని, ఈ నెల 5న సింగరేణి ప్రధాన కార్యాలయంలో ద్వైపాక్షిక(సింగరేణి, ఏఐటీయూసీ) ఒప్పందం చేసుకున్నారు. తాజాగా గురువారం డిప్యూటీ సీఎల్‌సీ కార్యాలయంలో త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. దీని ప్రకారం గని ప్రమాదంలో మరణించిన ఉద్యోగి కుటుంబంలో అర్హులైన టెక్నికల్ డిగ్రీ అభ్యర్థులు లేనప్పుడు జనరల్ డిగ్రీ ఉంటే లభ్యతను బట్టి క్లర్కు గ్రేడ్-3 పోస్టులు ఇస్తారు. అయితే అభ్యర్థులు ఇందు కోసం నిర్వహించే ప్రత్యేక పరీక్షలో పాల్గొని ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. కాగా ఉత్తీర్ణులు కానివారికి జనరల్ అ సిస్టెంట్(కేటగిరీ-1) ఉద్యోగావ కాశం కల్పిస్తారు. కార్యక్ర మంలో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషన ర్(సెంట్రల్) బిశ్వభూషణ్, సింగరేణి పక్షాన డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు, జీఎం (యూజీ మైన్స్) వై. రఘురామిరెడ్డి, జీఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పీఎం కవితానాయుడు, జీఎం(హెచ్‌ఆర్‌డీ) టి వెంకటరామరెడ్డి జీఎం(సివిల్) డి వెంకటేశ్వర్లు, జీఎం(ఎంఎస్) రవి బొజ్జా, గుర్తింపు సంఘం పక్షాన ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య, అదనపు కార్యదర్శి ఎం. రంగయ్య,ఉప ప్రధాన కార్యదర్శులు కె వీరభద్రయ్య, ఎం సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య, వైవీరావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు ఉండకూడదు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల సంరక్షణ కోసం చర్యలు తీసుకోవడంలో భాగంగా అటవీ ప్రాంతంలో విద్యుత్ లైన్లు ఉండకుండా చూడాలని వైల్డ్ లైఫ్ టాస్క్‌ఫోర్స్ టీం విద్యుత్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని డీపీవో కార్యాలయంలో విద్యుత్ అధికారులతో టాస్క్‌ఫోర్స్ సభ్యులు సమావేశం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతి లేకుండా అటవీ ప్రాంతంలో విద్యుత్ వైర్లు తొలగించి రెవెన్యూ భూమిలో నుంచి వేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు ఎఫ్‌ఆర్వో అనీల్‌కుమార్, సీఐలు రవీందర్, రాణా ప్రతాప్, ముసావీర్, సద్దాం, విద్యుత్ శాఖ ఈఈ శేషారావు, ఏడీఈ రాజేశ్వర్, ఏఈ ఇర్ఫాన్ అహ్మద్, అంజల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా


రికార్డులు పరిశీలిస్తున్న పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా

బెల్లంపల్లి, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలు, నేరాల నియంత్రణకు పోలీసులు కృషి చేయాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. గురువారం టూటౌన్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫిర్యాదుదారులపై మర్యాదగా ప్రవర్తించాలని సిబ్బందికి సూచించారు. డయల్100కు ప్రజలనుంచి వచ్చిన కాల్స్‌ను తక్షణమే స్పందించి వెంటనే సంఘటన స్థలానికి చేరుకునేలా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించేలా విధులు నిర్వహించాలని పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెంపొందించేలా వ్యవహరించాలన్నారు. అనంతరం పోలీసుస్టేషన్‌లోని రికార్డులను, ఎఫ్ఐ రికార్డులు పరిశీలించారు. పోలీసు స్టేషన్ పరిసర ప్రాంతాన్ని పరిశీలించి ఎస్ఐ కిరణ్‌కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, ఏసీపీ రవి కుమార్, రూరల్ సీఐ హనుక్, పాల్గొన్నారు.

కేకే5 గనిలో హోమానికి ఏర్పాట్లు

మందమర్రిటౌన్, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలోని కేకే5 గనిలో శుక్రవారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం హోమం నిర్వహించనున్నారు. గని ఆవరణలోని అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని సర్వాంత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అమ్మవారి గుడిని వివిధ పూలతో అలంకరిస్తున్నారు. అమ్మవారికి హోమం సందర్భంగా ముస్తాబు చేస్తున్నారు. ఏరియా జీఎం తోపాటు వివిధ విభాగాల అధికారులు హాజరుకానున్నారు. అమ్మవారి తీర్థప్రసాదాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఉపాధి పనులను పారదర్శకంగా నిర్వహించాలి

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్

లక్షెట్టిపేట సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఎస్ కిషన్ అన్నారు. లక్షెట్టిపేట మండలంలోని 18 గ్రామాలోని 2024-25 ఆర్థిక సంవత్సరం ద్వారా రూ 3, 75 కోట్లతో చేపట్టిన ఉపాధి హామీ పనులకుగాను ఈనెల 17 నుంచి 23వరకు గ్రామాల్లో సోషల్ ఆడిట్ టీమ్ తనిఖీ నిర్వహించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం కూలీలకు పనులు కలిపించాలన్నారు. కొన్ని ప్రొసీజర్స్ లోపం వల్ల రూ 4వేల పెనాల్టీలు రూ. 1839 రికవరీ మొత్తం రూ 5839 రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ కిరణ్, సోషల్ ఎస్‌టిఎం వేణు, ఈజీఎస్ ఏపివో వేణు గోపాల్, ఎస్ఆర్పీ సాయిలు పాల్గొన్నారు.

● పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రజలందరు కృషి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్ కోరారు. గురువారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీవో సరోజ, గ్రామ పంచాయతీ కార్య దర్శులు, ఐకేపీ, ఈజీఎస్ సిబ్బందితో కలిసి శ్రమదానం నిర్వహించారు.

ఓరియంట్ కార్మికులకు మెరుగైన బోనస్

-హర్షం వ్యక్తం చేస్తున్న కార్మికులు

కాసిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దేవాపూర్ (ఆదాని) సిమెంట్ కంపెనీ కార్మికులకు మెరుగైన బోనస్ చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందని గుర్తింపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సత్యపాల్‌రావు అన్నారు. గురువారం సిమెంట్ కంపెనీ యాజమాన్యంతో జరిగిన చర్చల్లో పర్మినెంటు, లోడింగ్ కార్మికులకు రూ.41,500 బోనస్, కాంట్రాక్టు కార్మికులకు రూ. 17,800 బోనస్ చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. గతంలో ఉన్న గుర్తింపు సంఘం మెరుగైన బోనస్ ఇప్పించడంలో వైఫల్యం చెందిందన్నారు. బోనస్ డబ్బులను రెండు రోజుల్లో కార్మికుల ఖాతాల్లో జమ కానున్నట్లు తెలిపారు. మెరుగైన బోనస్ సాధించడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కంపెనీ గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి బీమిని మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేరుగు శంకర్, కార్మికసంఘాల నాయకులు రమణారెడ్డి, సతీష్‌రెడ్డి, హెచ్‌ఆర్ జీఎం ఆనంద్‌కులకర్ణి పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ ప్రమోద్‌రావు ఆధ్వర్యంలో పట్టణ ఎస్ఐ తిరుపతి బృందం బుధవారం తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా 140 గ్రాముల గంజా యిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, కోట దినేష్ (22), షేక్ మోకీద్ (18) వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి విచారణ అనంతరం న్యాయాధి కారుల ఎదుట హాజరు పరచగా, రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

సూక్ష్మం..కీలకం

- పంటల్లో సూక్ష్మ పోషకాలను నిర్లక్ష్యం చేస్తే నష్టం
- లోపాలను సవరిస్తేనే ఆశించిన దిగుబడి
- రైతులకు కేవీకే శాస్త్రవేత్త సూచనలు

నెన్నెల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో ప్రధాన పోషకాలు ఎంత అవసరమో సూక్ష్మ పోషకాలు కూడా అంతే అవసరం. అయితే రైతులు నత్రజని, భాస్వరం, పొటాష్ తదితర ప్రధాన పోషకాలను అవసరానికి మించి అందిస్తున్నారు. ఇదే సమయంలో మెగ్నీషియం సల్ఫేట్, జింకు, బోరాన్ తదితర సూక్ష్మ పోషకాలను అందించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇందుకు అవగాహన లేమి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ కారణంగా పంటలకు వీటి లోపం ఏర్పడి ఆ ప్రభావం దిగుబడిపైన పడుతోంది. ప్రధానంగా వరిలో సూక్ష్మపోషకాలైన జింక్, బోరాన్, పత్తిలో మెగ్నీషియం, జింకు, బోరాన్ లోపాలను గుర్తించామని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ నల్లా మహేష్‌రెడ్డి తెలిపారు. తగిన చర్యలు చేపడితేనే ఆశించిన దిగుబడులు వస్తాయని సూచిస్తున్నారు.

● సూక్ష్మ పోషకలోపానికి కారణం..

మోతాదుకి మించి రసాయనిక ఎరువులు వాడకం, భాస్వరం ఉన్న భూముల్లో కూడా కాంప్లెక్స్ ఎరువులు వాడడం, సేంద్రియ ఎరువులు వాడక పోవడం, ఏటా ఒకే పంట సాగు చేయడం తదితర కారణాల వల్ల భూమిలో సూక్ష్మపోషకాల లోపం ఏర్పడుతుంది. ఉదజని సూచిక, లవణాల శాతం ఎక్కువగా ఉన్న భూముల్లో, చౌడు, సున్నం వంటి సమస్యాత్మక నేలల్లో కూడా సూక్ష్మపోషక లోపాలు కనిపిస్తాయి.

● ప్రధానంగా ఈ నాలుగేఅవసరం..

పంటలకు ప్రధాన పోషకాలతో పాటు జింక్, బోరాన్, ఐరన్, మెగ్నీషియం సల్ఫేట్ అనే నాలుగు సూక్ష్మ పోషకాలే ప్రధాన అవసరం అవుతాయి. ఇందులో కూడా జింకు లోపం అధికంగా కనిపిస్తోంది. వీటిని తగిన మోతాదులో అందిచినప్పుడే పైరులో ఎదుగుదల బాగుండడంతో పాటు వేసిన ఎరువులను పంట బాగా గ్రహించుకోగల్గుతుంది. సూక్ష్మపోషక లోపాలను నివారించుకోక పోతే ఎరువులు ఎంత మేరకు అందించినా పెద్దగా ప్రయోజనం ఉండదు.


సూక్ష్మ పోషకాల లోపంతో రంగు మారిన పత్తి మొక్క


ఎర్రబారిన వరి పొలం


బోరాన్ లోపంతో పగిలిన పత్తికాయ

సూక్ష్మపోషకాల లోపాన్ని ఇలా గుర్తించాలి

జింక్ : ఆకులు చిన్నవిగామారి రంగుపాలిపోతుంది. ఆకులపైనా, చివర్లలో మచ్చలు ఏర్పడుతాయి.

మెగ్నీషియం: ఆకుల చివర్ల నుంచి రంగు పాలిపోతుంది.

మాంగనీసు: ఆకుల రంగు పాలిపోతుంది. ఈనెలు ముదురు ఆకుపచ్చ రంగులోనికి మారుతాయి.

సల్ఫర్ : ఆకులు లేత ఆకుపచ్చ రంగులోనికి మా రుతాయి. ఈనెలు రంగు పాలిపోతాయి.

బోరాన్ : చిగుర్లు రంగు మారిపోతాయి. రాలిపోతాయి.

కాల్షియం: మొక్క ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటుంది. లేత ఆకులు రంగు పాలిపోతాయి.

ఐరన్ : ఆకుల రంగు పాలిపోతుంది. ఈనెలు ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటాయి.

కాపర్ : ఈనెల మధ్యభాగం లేత గులాబి రంగులోకి మారుతుంది.

మాలిబ్డినం : ఆకులు లేత ఆకుపచ్చ, పసుపు, నారింజ రంగులో ఉంటాయి. ఆకుల అడుగు భాగం నుంచి జిగట పదార్థం స్రవిస్తుంది.

సూక్ష్మపోషకాలపై రైతులు అవగాహన కలిగిఉండాలి

- డాక్టర్ నల్లా మహేష్‌రెడ్డి, సేద్య విభాగం శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి



సూక్ష్మ పోషకాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలి. సూక్ష్మ పోషకాల లోపంవల్ల పంట దిగుబడిపై తీవ్రప్రభావం పడుతుంది. భాస్వరం, నత్రజని, పొటాష లాంటి ప్రధాన పోషకాలకు ఇచ్చే ప్రాధాన్యత సూక్ష్మపోషకాలైన జింకు, బోరాన్, మెగ్నీషియం సల్ఫేట్, ఐరన్‌లకు కూడా ఇవ్వాలి. భూమిలో పంటలకు సరిపడ సూక్ష్మ పోషకాలు లేకపోతే ఎన్ని ఎరువులు వేసిన లాభం లేదు. ఎరువులను పంటలు స్వీకరించలేవు. ఏటా ఒకే పంట సాగు చేయకుండా పంట మార్పిడి చేస్తే ప్ర యోజనం ఉంటుంది. రైతులకు సూక్ష్మ పోషకాల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి ఎప్పటికప్పుడు నివారణ చర్యలు సూచిస్తున్నాం.

రాజ్యాధికారంతోనే దళిత బహుజనుల అభివృద్ధి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాధికారంతోనే దళిత బహుజనుల అభివృద్ధి సాధ్యమని ఆర్‌పీఐ(ఏ) రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవికుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పది శాతం లేని అగ్రకులాలు రాజ్యమేలుతున్నాయన్నారు. ఆర్‌పీఐ(ఏ) ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తామన్నారు. పార్టీ బలోపేతం కృషి చేస్తున్నామని, ఇప్పటికే జిల్లాలో కమిటీలను వేశామన్నారు. పార్టీ అభివృద్ధికి సభలు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిని నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వెంకటకస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● ఆర్‌పీఐ(ఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా క్యాతనపల్లికి చెందిన గుడికందుల తిరుపతిని నియమితులయ్యారు. నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ అందజేశారు.

బాల్య మిత్రుడికి చేయూత..

దండేపల్లి సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చిన్ననాటి మిత్రుడైన దుమాల రాజన్న ఇళ్ల నిర్మాణం కోసం రూ లక్షా 50వేల విరాళాన్ని దండేపల్లికి చెందిన బాల్య మిత్రుడు నల్మాస్ మల్లికార్జున్ స్నేహితుడికి అందజేసి అండగా నిలిచాడు. బాల్యమిత్రుడు రాజన్న-శ్యామల దంపతుల కుమారుడు దివ్యాంగుడు, వారిది నిరుపేద కుటుంబం. వీరికి ఇటీవల ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇళ్ల మంజూరైంది. ఇళ్లు కట్టుకునే స్థోమత లేక ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న మిత్రుడు స్పందించి స్నేహితుడి కుటుంబానికి గురువారం లక్షా 50వేల నగదును అందజేశారు. సేవకు మించిన దైవంమ రొకటి లేదని పరులకు ఉకారం అందించినప్పుడే సంతృప్తి కలుగుతుందన్నారు.

ఆర్‌కే 7 గనిపై హోమం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దుర్గా శరన్నవరాత్రుల్లో భాగంగా ఆర్‌కే 7 గనిపై గురువారం హోమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జీఎం ఎం. శ్రీనివాస్ దంపతులు హాజరై మైసమ్మ ఆలయంలో కాత్యాయని అలంకారణలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. మేనేజర్ తిరుపతి, ఏఐటీ యూసీ ఉపాధ్యక్షుడు కిషన్‌రావు, రక్షణాధికారి సంతోష్ రావు, పిట్ కార్యదర్శి సారయ్య పాల్గొన్నారు.

గ్రూప్-1లో పరీక్షల్లో ప్రతిభ

బెల్లంపల్లి, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-1 ఫలితాలను టీజీపీఎస్సీ బుధవారం విడుదల చేసింది. ఇందులో బెల్లంపల్లి మండలం చిన్నబూద గ్రామానికి చెందిన కొత్తూరి సత్యనారాయణమూర్తి ఉత్తమ మార్కులు సాధించి కమర్షియల్ టాక్స్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించాడు. దీంతో పలువురు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

తండ్రిపై కొడుకు దాడి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కుటుంబ తగాదాలో తండ్రిపై కొడుకు కత్తితో దాడి చేసి గురువారం తీవ్రంగా గాయపర్చాడు. గాంధీనగర్‌కు చెందిన ఎనగందుల రంగయ్య, వజ్రమ్మకు ఇద్దరు కొడుకులు. చిన్న కొడుకు శివకుమార్ భార్య వదిలి వెళ్లింది. ఇంట్లో కొద్ది రోజులుగా కు టుంబ కలహాలు నడుస్తున్నాయి. ఇంట్లో గురువారం గొడవ జరగడంతో కత్తితో తండ్రి పై దాడికి పాల్పడ్డాడు. అడ్డుకునే ప్రయత్నం చేసిన తల్లిని తోసేయడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. పెద్ద కొడుకు క్రాంతి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

కాలనీవాసుల శ్రమదానం

దండేపల్లి సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో గురువారం ఐకేపీ కార్యలయ సమీపంలో కాలనివాసులు, శ్రమదానం చేశారు. కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, కార్యదర్శి శ్రీలతరెడ్డి, కాలని వాసులు, ఐకేపి సిబ్బంది పాల్గొన్నారు.

ఎడతెరపి లేని వర్షం..

(5వ పేజీ తరువాయి)

మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి కలెక్టర్‌తో మాట్లాడారు. దీనికి సంబంధించి నిధులు మంజూరు చేయిస్తానని ఆయన తెలిపారు. ఇదే విషయాన్ని తెలుసుకున్న స్పందించిన మంత్రికి బొక్కల గుట్ట గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

కోటపల్లి : మండలంలో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ఎడతెరిపి లేని వర్షంతో జన జీవనం స్తంభించిపోయింది. నక్కలపల్లి దారిలోని లోత్రొరై పొంగి పొర్లడంతో ఈ రహదారిలో రవాణా సౌకర్యాలు మూసుకుపోయాయి. మరో వైపు వాగులు, వంకలు ఉప్పొంగడంతో చెరువుల్లోకి భారీగా నీరు చేరింది. అలాగే మండలానికి ఆనుకుని ప్రవహిస్తున్న గోదావరి, ప్రాణహిత నదుల ప్రవాహం పెరిగింది.

పై ప్రాంతాల్లోని వరద ఇక్కడ కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది ఉధృతంగా పొంగి పొర్లుతుండగా ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరిలో నీటి ప్రవాహం క్రమ క్రమంగా పెరుగుతుంది. కాగా మహారాష్ట్ర నుంచి ఇటు వైపు ఇటు నుంచి అటు వైపు నదిలో నడిచే పడవలను నిలిపివేశారు. జాలర్లు ఎవరు కూడా చేపల వేటకు వెళ్లవద్దని, ఎవరు నది ప్రవాహ ప్రాంతం వైపు వెళ్లవద్దని ఎస్ఐ రాజేందర్ సరిహద్దు తీర ప్రాంతాల ప్రజలకు సూచించారు.

భీమారం : మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మండలంలోని జలాశయాలు, చెరువులు నీటితో నిండిపోయాయి. పలు గ్రామాల్లోని మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. కురుస్తున్న వర్షంతో ప్రజలు, రైతులు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. కురుస్తున్న వర్షంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పూత పూసి, కాత కాసినవి నల్లబడిపోతాయని పేర్కొంటున్నారు. వరి పంట రైతులు వర్షాల వల్ల తెగులు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది.

మందమర్రిరూరల్ : మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. వివిధ పనులకు వర్షం అంతరాయం కలిగించింది. కూలీ పనులకు వెళ్లే వారు వర్షంతో ఇళ్లకే పరిమితమయ్యారు.

జైపూర్ : మండలంలో గురువారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. వర్షం వల్ల గోదావరి ఉప్పొంగడంతో గోదావరి పరివాహక ప్రాంతాలైన వేలాల, శి


వేలాలలో మునిగిన పంట పొలాలు

వ్వారంలో పంటలు నీట మునిగినట్లు మండల వ్యవసాయాధికారి మార్క్ గ్లాడ్‌స్టన్ తెలిపారు.

దండేపల్లి: మండలంలో ఎడతెరని లేని వర్షంతో వాగులు, వంకలు ఉప్పొంగాయి.

ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు ఎస్సారెస్పీకి భారీగా నీరు చేరడంతో ప్రాజెక్టు గేట్లు లేపి దిగువకు నీరు విడుదల చేశారు. దీంతో గూడెం గోదావరి నదికి వరద నీటి ఉధృతి చేరింది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జైపూర్ : వేలాల గ్రామంలోని రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వనజారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్‌లు పేర్కొన్నారు. గురువారం వేలాల గోదావరి పరివాహక ప్రాంతాన్ని సందర్శించారు. ఎగువ ప్రాంతంలో వర్షాలు పడుతుండడంతో పాటు ఎల్లంపల్లి ప్రాజెక్టులోని గేట్లు ఎత్తివేయడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుందన్నారు. రైతులు గోదావరి వైపుకు వెళ్ల వద్దన్నారు. వేలాల గ్రామంలోని పంట పొలాలను పరి శీలించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు పేర్కొన్నారు.


వేలాలలో పొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

పాటల ప్రపంచంలో రారాజు బాల సుబ్రహ్మణ్యం

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సంగీత ప్రపంచంలో పాటల రారాజుగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం దేశానికే వన్నె తెచ్చిన గాయకుడని మంచిర్యాల సంగీత గాయకుల జిల్లా అధ్యక్షుడు సిరికొండ బోసు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాలులో ఎస్పీ బాలు వర్థంతిని ఘనంగా నిర్వహించారు. బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సినిమా పాటలను తెలుగు భాషతో పాటు అన్ని భాషల్లో వేలాది పాటలు పాడిన గొప్ప వ్యక్తి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. డబ్బింగ్ ఆర్టిస్టుగా, గాయకుడిగా, నటుడిగా, నిర్మాతగా ప్రజలను అలరించారన్నారు. కళాకారులు భీమేందర్, సుధాకర్, పుష్ప, స్వరూప, మల్లేష్, అడ్వకేట్‌లు లచ్చన్న, కుమారస్వామి, మధు సూదన్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శ్రీధర్, పోచం, శంకరయ్య, బాలు పాల్గొన్నారు.


బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాల వేస్తున్న బోసు

నిండుకుండలా అన్నారం బ్యారేజీ

చెన్నూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కురుస్తున్న భారీ వర్షాలతో పాటు ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు తెర వడంతో మండలంలోని సుందరసాల గ్రామ సమీపంలోని అన్నారం (సరస్వతి) బ్యారేజీ నిండుకుండలా మారింది. గురువారం చెన్నూరు పట్టణ సీఐ దేవేందర్‌రావు బ్యారేజీని పరిశీలించారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


నిండుకుండలా ఉన్న అన్నారం బ్యారేజీ

మోదీ హయాంలో అన్ని రంగాల్లో అభివృద్ధి

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి

చెన్నూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని, మోదీ అమలు చేస్తున్న జీఎస్టీ సంస్కరణల వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. గురువారం చెన్నూరు పట్టణంలోని గాంధీ చౌక్‌లోని కిరాణం, మెడికల్, చెప్పుల దుకాణాలకు వెళ్లి జీఎస్టీ ధరల అమలుపై దుకాణదారులను అడిగి తెలుసుకున్నారు. జీఎస్టీ తగ్గింపుధరలను ప్రజలకు అందించాలని దుకాణాల యాజమానులకు సూచించారు. అనంతరం చెన్నూరులోని మార్వాడీ భవన్‌లో బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన అభినందన సభలో రఘునాథ్ వెరబెల్లి పాల్గొన్నారు. ఆయనను నాయకులు పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ జిల్లా కార్యకర్తల కృషి వల్లనే బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవీ తనకు దక్కిందన్నారు. ప్రజలందరు బీజేపీకి రాష్ట్రంలో అధికారం ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతం కృషి చేయాలన్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేది బీజేపీయేనని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిధుల వల్లనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రజా సమస్యల పై పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులు దుర్గం అశోక్, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, రాపర్తి వెంకటేశ్వర్లు, సమ్మయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, ముకేష్‌గౌడ్, కమలాకర్‌రావు, శ్రీపాల్, వెంకటనర్సయ్య, శ్రీనివాస్‌చారి, శివకృష్ణ, రామయ్య, నాగేశ్వర్‌రావు, పున్నంచంద్, రాజశేఖర్ గౌడ్, పాల్గొన్నారు.


రఘునాథ్ వెరబెల్లిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

జీఎం కార్యాలయంలో బతుకమ్మ ఆట

శ్రీరాంపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్‌లోని జీఎం కార్యాలయంలో గురువారం బతుకమ్మ ఆడారు. ముఖ్య అతిథులుగా జీఎం శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు ఉమారాణి హాజరయ్యారు. జీఎం మాట్లాడుతూ, ప్రతి ఏడాది ఆశ్వయుజ మాసంలో తొమ్మిది రోజుల పాటు బతుక మ్మను ఘనంగా జరుపుకుంటామన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనా రాయణ, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, డీజీఎం (ఇం టర్నల్ ఆడిట్) వరలక్ష్మీ, సీనియర్ పీవో కాంతారావు, లా అధికారి ప్రబంధిత, అకౌం ట్స్ అధికారి పద్మ, పిట్ కార్యదర్శి సందీప్, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైన్ షాపుల టెండర్లకు నోటిఫికేషన్

(5వ పేజీ తరువాయి)

వారికి రిజర్వు చేయనున్నారు. రిజర్వేషన్ల దామాషా ప్రకారం ఎస్సీ సామాజిక వర్గాలకు 10, ఎస్టీలకు 06, గౌడ కులస్థులకు గరిష్టంగా 06 శాతం షాపులు కేటాయించనున్నారు. మిగతా 51 షాపులకు ఆయా రిజర్వేషన్ కేటగరీలతోపాటు నాన్ రిజర్వు వర్గాలకు చెందిన వ్యాపారులు కూడా దరఖాస్తు చేసుకు నేందుకు వెసులు బాటు ఉంది.

వాయిదాల పద్ధతిలో లైసెన్స్ ఫీజు చెల్లింపు..

లైసెన్సు రుసుమును వాయిదాల పద్ధతి లో చెల్లించాల్సి ఉంటుంది. అందులో మొదటి వాయిదాను అక్టోబరు 23,24 తేదీల్లో చెల్లించేలా నిర్ణయించారు. జనాభా ప్రాతి పదికన లైసెన్స్ ఫీజును స్లాబుల వారీగా నిర్ణయించారు. లైసెన్సు ఫీజును గత మద్యం పాలసీ ప్రకారమే 5 వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో మొత్తం 17 షాపులు కేటాయించగా ఒక్కో దుకాణానికి యేడాదికి రూ. 50 లక్షలుగా నిర్ణయించారు. 5వేల నుంచి 50వేల జనా భాగల పట్టణాల్లో 17 షాపులు ఉండగా సాలుసరి ఫీజు రూ. 55 లక్షలు, 50వేల నుంచి 5 లక్షల జనాభా ఉన్న ప్రాంతాల్లో 38 షాపులు ఉండగా రూ. 60 లక్షలు సాలుసరి లై సెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అయితే జైపూర్ మండలం ఇందారంలో ఒక షాపు ఉండగా, ఇక్కడ మాత్రం గరిష్ఠంగా సాలు సరి లైసెన్సు ఫీజు రూ. 65 లక్షలు నిర్ణయించారు. ఇక్కడ 5వేల లోపు జనాభా ఉన్నప్పటికీ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి 5 కిలో మీటర్ల లోపు పెరిఫెరి ఉన్నందున ఇక్కడ రూ. 5 లక్షలు అదనపు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.



నంబర్ ప్లేట్లు మార్చాల్సిందే



- పాత వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్
- 2019కి ముందు కొన్న వాటికి తప్పనిసరి
- ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిన రవాణా శాఖ
- సెప్టెంబరు 30 వరకు గడువు
- ఆన్‌లైన్‌లో నమోదుకు సాంకేతిక చిక్కులు

వాంకిడి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రహదా రి భద్రతపై సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి అన్ని రకాల వాహనాలకు హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబరు తప్పని సరి చేస్తూ రవాణా శాఖ ఉత్తర్వు లు జారీ చేసింది. 2019 ఏప్రిల్ 1వ తేదీకి ముం దు తయారైన వాహనాలకు హైసెక్యూరిటీ ప్లేట్లు తప్పనిసరి చేస్తూ అన్ని రాష్ట్రాల్లో దీన్ని అమలు చేయాలని కేంద్రం పేర్కొన్న ది. వాహన రకాన్ని బట్టి రూ. 320 నుంచి రూ. 860 వరకు రుసుము చెల్లించాలని ఖరారు చేసిం ది. దీనికి సంబంధించి సెప్టెంబరు 30వరకు గడు వు విధించారు. ఆ తర్వాత హెచ్ ఎస్ఆర్‌పీ నం బరు లేని వాహనాలు రోడ్లపై తిరిగితే రవాణా శాఖ అధికా రులు జరిమానా విధించే అవ కాశం ఉందని చెబుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 9న కేంద్ర ప్రభుత్వం జీవో విడుదల చేసినా నేటివరకు ఈ ప్రక్రియపై వాహనదారులకు స్పష్టత కరవైంది. చాలా మందికి దీనిపై అవగా హన లేకపోవడం, ఉన్న వారు ఆన్‌లైన్‌లో చేసుకునే సమ యంలో సాంకేతిక సమస్యలు వస్తుండడంతో వాహన దారులు ఆందోళనకు గురవుతు న్నారు. ఆన్‌లైన్ లోనే అనేక సమస్యలు ఉన్నాయని నమోదు చేసే అవకాశం ఉండడం లేదని వాహన దారులు వాపోతున్నారు. హెచ్‌ఎస్ ఆర్‌పీ నంబరు విషయంపై రవాణాశాఖ అధికారులను సంప్రదించి నా స్పష్టత ఇవ్వడం లేదని వాహనదారులు చెబుతు న్నారు.

జిల్లాలో పాత వాహనాల వివరాలు..	
ద్విచక్రవాహనాలు	36,877
కార్లు	2,744
ట్రాక్టర్లు, ట్రైలర్లు	3,737
ఇతర వాహనాలు	496

- వాహనదారుడే నేరుగా..



పాతవాహనానికి హైసెక్యూరిటీ నంబరు ప్లేటు పొందాలంటే వాహనదారుడే నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎస్ఐ ఏఎం.ఇన్ వెబ్‌సైట్ అందుబాటులో ఉంచింది. నిరక్షరాస్యులైన వాహనాదారులకు ఈ వెబ్‌సైట్‌పై అవ గాహన లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సివస్తుంది. అవ గాహ న ఉన్నవారు సైతం అందులో వివరాలు నమోదు చేస్తే తీసుకోవడంలేదని పేర్కొంటున్నారు. ఇచ్చిన గడువు సమీపిస్తుండడం ఆన్‌లైన్ కాకపోవ డంతో వాహన దారులకు ఎటు అర్థం కాని పరి స్థితి ఏర్పడింది. ఈ నెల 30 తర్వాత వాహనాలు రోడ్డెక్కితే చట్టపరమైన చర్యలుంటాయని రవాణాశాఖ అధికారులు హెచ్చరించడం హెచ్‌ఎస్ఆర్‌పీ చేయడానికి కేవలం ఐదు రోజులే గడువు ఉండడంతో వాహన దారులు ఆందోళనకు గురవుతున్నారు. నిరక్షరా స్యులు, స్మార్ట్‌ఫోన్ లేని వాహన దారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. హెచ్‌ఎస్ ఆర్‌పీ కోసం జిల్లా కేంద్రం లోని ఏదైనా షోరూంల వద్ద ఆన్‌లైన్ చేసేలా అధి కారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

చెల్లించే రుసుములు ఇలా..	
వాహనం	చెల్లించాల్సిన రుసుం
ద్విచక్రవాహనం స్వదేశీ	320 - 360
ద్విచక్రవాహనం విదేశీ	400 - 500
కార్లు స్వదేశీ	590 - 700
కార్లు విదేశీ	700 - 860
త్రిచక్ర వాహనం	350 - 450
కమర్షియల్ వాహనాలు	600 - 800

గిరిజనుల అభివృద్ధికి ప్రాధాన్యం



గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, గ్రామస్థులు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి ప్రాధాన్యమి స్తున్నామని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు రమాదేవి అన్నారు. గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జన జాతీయ గ్రామీణ ఉత్కర్ష్ అభియాన్ పథకం ద్వారా గిరిజనులకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు గిరిజనులకు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని గురువారం కేంద్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి బృందం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం రౌటసంకెపల్లి గ్రామంలో పరిశీలించారు. గిరిజనులతో ముఖాముఖి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు రమాదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రజల అభివృద్ధికి అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలో 102 గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కోసం ఈ పథకం ప్రారంభించామని అన్నారు. కార్యక్రమంలో ఏటీడీవోలు శ్రీనివాస్, చిరంజీవి, కార్యదర్శులు మధుకర్, ఉపాధ్యాయులు శంకర్, గోపాల్, మమత, కవిత, తిరుపతి, పోశం, తిరుపతి, కిష్టయ్య, కొండు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బెజ్జూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి: మరో మూడు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని వాతారవణ అధికారుల సూచనతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామ్మోహన్ అన్నారు. కుశ్నపల్లి, సోమిని గ్రామాల మధ్య లోలెవల్ వంతెనలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకూడదని సూచించారు. వాగులను ప్రజలు ఎవరు దాటవద్దని సూచించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ ఇళ్లలోనే గడపాలని సూచించారు. విద్యుత్ పరికరాలను ముట్టుకోరాదని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ వేణుగోపాల్, కార్యదర్శి రోజ, జీపీవో మారుతి ఉన్నారు.

రాజాబావు కోబ్రాగడేకు ఘన నివాళి

వాంకిడి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో దివంగత రాజ్యసభ డిప్యూటీ చైర్మన్, ఆర్పీఐ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాజబావు కోబ్రగడే జయంతిని పురస్క రించుకుని గురువారం ఆయన చిత్రప టానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు దుర్గాజీ, విజయ్, శ్యాంరావు, లహుజీ, రాజేశ్వర్, పాండుజీ, భీంరావు, పితాంబర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాయకుల పూజలు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బాపునగర్ శారద గణేష్ మండలి వద్ద నిర్వహిస్తున్న శారద దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులతో కలిసి అర్చకుడు రాజుశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బాలేష్‌గౌడ్, ఆశ్విన్, ప్రసాద్‌గౌడ్, ప్రతాప్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గూటికి మాజీ ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గతంలో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కోనప్ప అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొంత కాలంగా కాంగ్రెస్‌కు దూరంగా ఉంటూ వస్తున్న కోనప్ప గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కోనప్పతో పాటు అతడి సోదరుడు మాజీ ఇన్‌చార్జి జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావుకు కేటీఆర్, హరీష్‌రావు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరుపున సిర్పూర్ నియోజకవర్గంలో పోటీ చేసి బీజేపీ అభ్యర్థి హరీష్‌బాబు చేతిలో ఓటమిపాలయ్యారు.



మాజీ ఎమ్మెల్యే కోనప్పతో పాటు కృష్ణారావుకు బీఆర్ఎస్ కండువా వేస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు

‘కల్యాణలక్ష్మి’ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో గురువారం 93 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే కోవ లక్ష్మి పంపిణీ చేశారు. వీటితో పాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులను సైతం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కల్యాణ లక్ష్మి, షాదీము బారక్ పథకాల లబ్ధిదారులకు ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పిందన్నారు. అధికారం చేపట్టి రెండేళ్లు కావస్తున్నా లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వడంలో విఫలమైం దని చెప్పారు. అబద్ధపు హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తప్పకుండా బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో వీపీ సీపీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చింతలమానేపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జెల్లి గ్రామానికి చెందిన సుర వర్ధన్‌కు రూ.40 వేలు, డోకె నగేష్‌కు రూ.7500, స్నేహ అంబీరుకు రూ24 వేల సీఎంఆర్ఎస్ చెక్కులు మంజూరు కావడంతో గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆదేశాల మేరకు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నానయ్య, కల్పన, రంగయ్య, తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మర్‌పల్లి, ఒడ్డుగూడ, రాళ్లగూడ, రాంపూర్, దహెగాం గ్రామాల్లో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ధనుంజయ్, దామోదర్, సత్యనారాయణ, ప్రదీప్, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు అందజేత

లింగాపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు జాముల్‌ధర గ్రామపంచాయతీలోని రైతులకు పీఎంకేఎస్‌వై పథకంలో భాగంగా గురువారం సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు అందజేశామని ప్రాజెక్టు మేనేజర్ అంజనేయులు, ఫీల్డ్ అధికారి షేక్ హైమద్ తెలిపారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

అనారోగ్యంతో సీనియర్ నాయకుడి మృతి

వాంకిడి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఎంఆర్‌ఎంపీ వైద్యుడు ధన్వల్‌కార్ సుధాకర్ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధప డుతున్నాడు. మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్, నాయకులు నారాయణ, తదితరులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్‌రజ్యోతి): హైదరాబాద్ నిజాం కళాశాలలో శుక్రవారం నుంచి 29 వరకు నిర్వహించే 17వ మినీ బాల బాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు రెఫరీలుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి సునార్కర్ అరవింద్, రాజలింగు, రాజశేఖర్, సాయి ఎంపికయ్యారు. వీరు అంతర్జాతీయ, జాతీయ స్థాయి పోటీల్లో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారని జిల్లా హ్యాండ్‌బాల్ అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి రమేష్ తెలిపారు. వీరి ఎంపిక పట్ల అసోసియేషన్ సభ్యులు రమేశ్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, మల్లికార్జున్ యాదవ్, డీవైఎస్‌వో రమాదేవి, కోచ్‌లు తదితరులు అభినందించారు.

గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యం

ఆసిఫాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆదికర్మ యోగి పథకం ద్వారా గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ కార్యదర్శి విభునాయర్ అన్నారు. న్యూఢిల్లీలోని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ కార్యాలయం నుంచి గురువారం ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణలోని జిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, గిరిజన సంక్షేమాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. గిరిజన ప్రాంతాలలో రహదారులు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, అంగన్‌వాడీ కేంద్రాలలో వసతులు, ప్రతీ గ్రామానికి విద్యుత్ సౌకర్యం, ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాల కోసం కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. గిరిజన గ్రామాలలో ఆది సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలోని వీసీ హాల్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆది కర్మయోగి పథకం అమలులో భాగంగా జిల్లాలోని 12 మండలాలో గల 102 గిరిజన గ్రామాలల్లో బ్లాక్ స్థాయి మాస్టర్ ట్రైనర్లు, విద్యాశాఖాధికారులతో గ్రామ స్థాయిలో శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. విద్య, వైద్యం, గిరిజన సంక్షేమం, తాగునీరు, విద్యుత్, వ్యవసాయ రంగాల అభివృద్ధి, రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందంచి గిరిజన గ్రామాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 2030 సంవత్సరం వరకు కార్యాచరణ రూపొందిస్తున్నామని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, వైద్య శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం



ఉప్పొంగి ప్రవహిస్తున్న దిందా వాగు

చింతలమానేపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచి మోస్తరు వర్షం చింతలమానేపల్లి మండలం ఉదయం నుంచి మోస్తారు వర్షం కురిసింది. ఈ వర్షంతో కేతిని-దిందా గ్రామాల మధ్య వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో పాటు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అయితే అధిక వర్షాల కారణంగా పత్తి పంటకు తీరని నష్టం వాటిల్లే అవకాశం ఉందని, తెగుళ్ల సోకి పంట దిగుబడిపై ప్రభావం చూపుతోందని రైతులు పేర్కొంటున్నారు.

బెజ్జూరు, .(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలో బుధవారం రాత్రి నుంచి ఏకదాటిగా ముసురు వాన కురుస్తోంది. ఏకదాటి కురుస్తున్న వానతో రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కురుస్తున్న వర్షం వరి పంటకు మేలు చేకూరేలా ఉన్నప్పటికీ పత్తి పంటకు మాత్రం ప్రతికూల పరిస్థితులు ఉన్నట్లు రైతులు తెలుపుతున్నారు. పత్తి పూత కాయ రాలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. కాగా మండలంలోని పోతెపల్లి గ్రామంలో ఏలేశ్వరం వెంకటేష్ ఇల్లు పాక్షికంగా కూలిపోయింది.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా గురువారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. లక్మాపూర్, అనార్‌పల్లి వాగు పొంగడంతో వాగు అవతల ఉన్న పది గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. మెట్టపిప్పిరి, కేలి(బి) గ్రామాల్లోని లోలెవల్ వంతెన పై నుంచి వరద నీరు ప్రవహించింది. ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పత్తి పంట దిగుబ డి గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి నుంచి వర్షం కురిసింది. వరదనీరు కాలనీల్లో చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. రోజంతా వర్షం పడడంతో వ్యవసాయ పనులకు ఆటంకం కలిగింది. ముసురు వర్షానికి అంతర్గత రోడ్లు బురదమయంగా మారడంతో రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడ్డారు.

S.	HTNO	RANK	NAME	CATEGORY	Gender	Subject
1	2524309221	12817	BUKYA SWATHI	ST	F	Bio- Sci
2	2525508318	3858	RAMTENKI HAREESHA	SC Group -3	F	Bio- Sci
3	2525301046	9352	TAKITH JAYA SRI	BC-B	F	Bio- Sci
4	2525508421	9400	POOJA NAGESHWARRAO ADLURI	SC Group - 2	F	Bio- Sci
5	2524304551	9796	ADIBA SHIREEN	BC-E	F	Bio- Sci
6	2515401025	12687	THAKUR ARADHANA BAIS	BC-B	F	Bio- Sci
7	2515301045	18712	CHINTALA SWAPNA	BC-A	F	Bio- Sci
8	2514314034	5071	KOTTE DEEPIKA	SC Group - 2	F	Maths
9	2524314080	5312	BOTHEKAR NITHIN	SC Group - 3	M	Maths
10	2524314104	8047	GARISHA RAVALI	SC Group - 3	F	Maths
11	2524102072	28349	M ROHINI	SC Group - 2	F	Maths
12	2515503226	5726	MOHAMMED ESA	BC-E	M	Maths
13	2514303047	6137	DHARMAJI M	SC Group - 3	M	Maths
14	2525504338	6774	JUMIDI VANDANA	SC Group - 3	F	Maths
15	2514107408	12771	BYAGADA SRAVANI	BC-B	F	Maths
16	2515004123	16344	ARKA YADAGIRI	ST	M	Physics
17	2514305047	23221	LENGAMPELI REKHA	SC Group - 2	F	Social
18	2524309794	2019	NETHAVATH LAKPATHI	ST	M	Social
19	2515501076	8453	DAHAGAVKAR AMOL	SC Group - 3	M	Social
20	2515002705	15381	MD AZHER HUSSSAIN	BC-E	M	Social
21	2525501035	21948	PULABOINA SAILATHA	BC-D	F	Social
22	2525003045	22021	SUJATHA SANGEM	BC-B	F	Social